

ట్రాఫిక్ అదనపు డీసీపీకి సమస్యలు తెలుపుతున్న జెక్‌కాలనీ సభ్యులు

ఎర్రగడ్డ సంత ట్రాఫిక్ సమస్యలు పరిష్కరిస్తాం

● ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి

సనత్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆదివారం నిర్వహించే ఎర్రగడ్డ సంత కారణంగా తలెత్తుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ అదనపు డీసీపీ సి.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎర్రగడ్డ సంతను ఏసీపీ శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ నిగిడాల సురేష్‌తో కలిసి పర్యవేక్షించారు. అనంతరం జెక్‌కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిబ్బంది మాట్లాడుతూ. కోర్టు, మానవహక్కుల కమిషన్ ఉత్తర్వుల మేరకు సంత వ్యాపారులు జెక్‌కాలనీ వీధుల్లోకి రాకుండా కట్టడి చేశామన్నారు. సంతకున్న ప్రాధాన్యం దృష్ట్యా రానున్న రోజుల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జెక్‌కాలనీ సంక్షేమ సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మల్లుప్రసాద్, రాజశేఖర్, చందులతో పాటు ప్రతినిధులు అనంతరెడ్డి, విశ్వనాథరాజు, కంజర్ల సదాశివయాదవ్, వెంకట్ సోమ, హర్నాని పుల్లారెడ్డి, నాగిరెడ్డి, రాజా, లక్ష్మారెడ్డి, తదితరులు అదనపు డీసీపీతో సమావేశమై ట్రాఫిక్ సమస్య గురించి వివరించారు.



అభినవ్ సర్దార్‌కు బిరుదు ప్రదానం చేస్తున్న మురళీమోహన్ తదితరులు

అభినవ్ సర్దార్‌కు ఉత్తమ నట సేవాదీప్తి బిరుదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అభినవ్ సర్దార్ కేతావత్‌ను ఉత్తమ నటసేవా దీప్తి బిరుదు వరించింది. ఆదివారం నగరంలో తేజస్విని కల్చరల్ అసోసియేషన్ నిర్వహించిన తెలుగు సంక్రాంతి సంగమం ఆధ్వర్యంలో ఈ బిరుదును ప్రముఖ నటుడు మురళీమోహన్ అభినవ్ సర్దార్‌కు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అభినవ్ సర్దార్ మాట్లాడుతూ.. చిన్న సినిమా, సీరియల్స్, వెబ్‌సిరీస్ అని కాకుండా వచ్చిన ప్రతీ పాత్రకు తాను న్యాయం చేసేందుకు ప్రయత్నం చేశానన్నారు. ఈ బిరుదు తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్‌లో అందరూ గుర్తుంచుకునే పాత్రలను పోషిస్తానన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎస్‌బి.సుధాకర్, బీజేపీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ, గంగాధరశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



బస్తీలవాసులతో మాట్లాడుతున్న మామిడి నర్సింగరావు

బస్తీలను అభివృద్ధి చేసుకుందాం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఐకమత్యంగా ఉంటూ బస్తీలను అభివృద్ధి చేసుకునేందుకు పునాదులు వేసుకోవాల్సిన అవసరం ఉందని ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సమితి అధ్యక్షుడు మామిడి నర్సింగరావు అన్నారు. ఫిలింనగర్ బస్తీల సంక్షేమ సమితి సమావేశం ఆదివారం గౌతంనగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడి నర్సింగరావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో బస్తీల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అనేక కార్యక్రమాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించుకునేందుకు బస్తీవాసులంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. బస్తీల వారీగా సమస్యలతో కూడిన జాబితాను సిద్ధం చేసి వాటిని త్వరలోనే ఎమ్మెల్యేకు అందించనున్నట్టు చెప్పారు.

రామ్మూర్తికి డాక్టరేట్



బాబుమోహన్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న రామ్మూర్తి

పంజాగుట్ట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సామాజిక కార్యకర్త, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి పంజాగుట్ట బాలాపుర బస్తీకి చెందిన సోమాద్రి రామ్మూర్తి సామాజిక సేవలో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఈనెల 3న గాడ్ సన్ హోలీ స్పిరిట్ థియోలాజికల్ అకాడమీ, మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో అబిడ్స్‌లోని సూర్యలోక్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన మెగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో మాజీమంత్రి బాబుమోహన్, సంస్థ చైర్మన్ బిషప్ డాక్టర్ ఎం.వి ప్రసాద్ రామ్మూర్తికి గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. ఆయనను పలువురు అభినందించారు.



మాగంటి గోపీనాథ్‌ను సన్మానిస్తున్న కృష్ణశర్మ, వినయ్‌సాగర్ తదితరులు

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా తనను మూడోసారి గెలిపించిన ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నట్లు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ అన్నారు. ఆదివారం రాజీవ్‌నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన గోపీనాథ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. జయంతినగర్‌లో మురుగు సమస్య పరిష్కరించాలని స్థానికుల ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఎర్రగడ్డ చెస్ట్ ఆస్పత్రిలో 1000 పడకలతో అధునాత టిమ్స్ ఆస్పత్రి నిర్మాణం త్వరలో పూర్తికానుందని తెలిపారు. రాజీవ్‌నగర్ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు పీఎస్వీ కృష్ణశర్మ మాట్లాడుతూ.. రాజీవ్‌నగర్ సంక్షేమ సంఘం, విద్యావికాస్, కమిటీ గణేశ్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజీవ్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వినయ్‌సాగర్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు భుజంగరావు, సయ్యద్ నసీర్, బదురుద్దీన్, కోశాధికారి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏడీఈ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్‌నగర్, బీఎస్ఆర్‌హిల్స్, బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, ఐటీఏ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, లక్ష్మీనగర్, ప్రసాద్ యూజీ,ఎల్వీప్రసాద్ మార్గ్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 12.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, అన్నపూర్ణ, జూబ్లీహిల్స్ పీఎస్, సినీమాక్స్, జింఖానా క్లబ్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఎల్లారెడ్డిగూడ ఫీడర్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

● హిమాయత్‌నగర్ బ్రాండ్ ఫ్యాక్టరీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, ఎల్బీ స్టేడియం, పోలీస్ కమిషనర్ కార్యాలయం ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ ప్రేమానంద్ పాయ్ తెలిపారు.

● ఇండస్ట్రియల్ ఎస్టేట్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, హెచ్‌పీ రోడ్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఫతేనగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ చరణ్ సింగ్ తెలిపారు.

టార్గెట్ టెన్షన్

● ఆస్తి పన్ను కలెక్షన్, సమీపిస్తున్న లోక్‌సభ ఎన్నికలు
● పని భారంతో ఒత్తిడికి లోనవుతున్న ఉద్యోగులు



ఖైరతాబాద్ మున్సిపల్ కార్యాలయం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీకి ప్రధాన ఆదాయం ఆస్తి పన్ను. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 55 రోజులు మాత్రమే గడువుంది. పన్ను వసూలు చేయాల్సిన సిబ్బంది మొన్నటి వరకు అసెంబ్లీ ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. ఎన్నికలు ముగిశాయని కాస్త ఊపిరి తీసుకునేలోపే ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ, వాటిని ఆన్‌లైన్ చేసే పనులు వచ్చాయి. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ ప్రతీ సిబ్బందికి టార్గెట్లు విధిస్తూ పన్ను వసూళ్లు చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నారు. మరోవైపు లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో వాటి పనులు సైతం చేపడుతూనే పన్ను వసూళ్లపై దృష్టి సారించారు జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది.

జంట సర్కిళ్ల లక్ష్యం రూ.383 కోట్లు

జీహెచ్‌ఎంసీలో ఖైరతాబాద్(17), జూబ్లీహిల్స్ (18) జంట సర్కిళ్లలో వసూలయ్యే ఆస్తి పన్నే ఎక్కువగా ఉంటుంది. నగర నడిబొడ్డున ఉన్న ఈ సర్కిళ్లలో వీఐపీల నివాసాలు, పెద్దపెద్ద షాపింగ్ మాల్స్, కమర్షియల్ భవనాలు, వాణిజ్య సముదాయాలు ఉండడంతో ప్రతేయేటా ఈ జంట సర్కిళ్ల నుంచి దాదాపు 300 కోట్ల రూపాయలకు పైగా ఆస్తిపన్ను వసూలవుతుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఖైరతాబాద్ సర్కిల్‌కు 170 కోట్ల ఆస్తి పన్ను వసూళ్లు చేయితనొ లక్ష్యాన్ని విధించగా జూబ్లీహిల్స్ సర్కిల్‌కు 213 కోట్ల రూపాయల టార్గెట్ ఇచ్చారు. గతేడాది సర్కిల్ 17 లో 134 కోట్ల రూపాయలు పన్ను వసూలు చేయగా ఈ సంవత్సరం జనవరి 31 వరకు 108 కోట్ల రూపాయల పన్ను వసూలు చేశారు. గతేడాది పన్ను లక్ష్యాన్ని అధిగమించే అవకాశమున్నా, ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకోవడం కొంత కష్టంగానే కనిపిస్తోంది. కాగా జూబ్లీహిల్స్ సర్కిల్‌లో గతేడాది 168 కోట్ల రూపాయలను పన్నుగా వసూలు చేయగా ఈ ఏడాది జనవరి 31 వరకు 136 కోట్లు రాబట్టారు. గత సంవత్సరం ఈ సమయానికి 148 కోట్లు వసూలు చేయగా పని భారంతో ఈసారి దాన్ని చేరుకోలేకపోయారు. మార్చి చివరినాటికి 213 కోట్ల రూపాయల ఆస్తి పన్ను వసూలు చేయడం ఈ సర్కిల్‌లో సైతం కష్టంగానే కనిపిస్తోంది.

టాక్స్ సెక్షన్‌కే ఎలక్షన్స్.. కలెక్షన్స్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గత అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ ఎన్నికల విధులు నిర్వహించిన టాక్స్ సెక్షన్ అధికారులు, సిబ్బంది ఎన్నికలు ముగియగానే కొత్త ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల పనులు చేపట్టారు. ఆ వెంటనే పన్నులు వసూలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి టార్గెట్లు రావడంతో వాటిపై నిమగ్నం కాగా అంతలోనే లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లు, ఓటరు జాబితాల పరిశీలన, కొత్త దరఖాస్తుల స్వీకరణ, విచారణలు, పోలింగ్ కేంద్రాల పరిశీలన, మార్పులు తదితర ఏర్పాట్లు చేస్తూనే ఫిబ్రవరి 8వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటన పనులు సాగుతున్నాయి. అటు కలెక్షన్, ఇటు ఎలక్షన్ పనులు రెండూ టాక్స్ సెక్షన్ అధికారులే చేయాల్సి రావడంతో అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి అధికమవుతోంది. ఖైరతాబాద్ సర్కిల్‌లో ఇద్దరు అసిస్టెంట్ కమిషనర్లు ఉండగా 8 మంది టాక్స్ ఇన్‌స్పెక్టర్లు, 11 మంది బిల్ కలెక్టర్లు పని చేస్తుండగా జూబ్లీహిల్స్ సర్కిల్‌లో ముగ్గురు ఏఎంసీలు, 9 మంది టాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు 8 మంది మాత్రమే ఉండగా ఉన్నతాధికారుల సూచనల మేరకు రెండు విధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నారు. ఎన్నికల విధుల్లో వీరికి యూసీడీ విభాగం సిబ్బంది సహకరిస్తున్నా, పన్ను వసూళ్లను ఇతరులకు అప్పగించే అవకాశం లేకపోవడంతో సర్కిల్ అధికారులు, సిబ్బందికి భారం తప్పడం లేదు.

నక్సల్ ఉద్యమం లేకుంటే.. తెలంగాణ ఉద్యమం లేదు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నక్సల్ ఉద్యమం లేకుంటే తెలంగాణ ఉద్యమం లేదని టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొ.ఘంటా చక్రపాణి అన్నారు. తెలంగాణ సమాజంలో ఉన్న అసమానతల కారణంగానే యువత తిరుగుబావుటా ఎగురవేసిందన్నారు. మంగళారపు లక్ష్మణ్ రాసిన 'మాయని గాయాల నెత్తుటి చరిత్ర' (యదార్థ సంఘటనల సమహారం) పుస్తక పరిచయ కార్యక్రమాన్ని రవీంద్రభారతి మినీహాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను విముక్తి చేసింది నక్సల్స్ ఉద్యమమనే నిజాన్ని సమాజానికి చెప్పాలన్నారు. కరీంనగర్‌తోపాటు మరిన్ని ప్రాంతాల చరిత్ర రాయాల్సిన అవసరముందన్నారు. మార్కెట్‌కు వచ్చిన రైతులను భూస్వాములు వేధించేవారని, కుల వివక్ష తీవ్రంగా ఉండటంతో హుస్నాబాద్ వంటి ప్రాంతాల్లో నక్సల్ ఉద్యమాలు జరిగాయన్నారు. ఆకలితో ఉన్న వారితోపాటు ఆకలిబాధ తెలిసిన ఎంతోమంది నక్సల్ ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. చరిత్రలో జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు తెలిపేందుకు తెలంగాణ సమాజంలో జరిగిన ఉద్యమాలపై ప్రత్యేక పుస్తకాలు రావాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి కార్పొరేషన్ తొలి చైర్మన్ వి.ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యమస్ఫూర్తిని చంపేశారని, మళ్లీ ఉద్యమస్ఫూర్తి రావాలన్నారు. ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ తెలుగునాట జరిగిన నక్సల్‌బరి ఉద్యమంలో ఉన్నత చదువులు చదువుకున్న ఎంతోమంది ప్రాణ త్యాగం చేశారన్నారు. మాయని గాయాల నెత్తుటి చరిత్ర వంటి పుస్తకాలు మరిన్ని రావాలన్నారు. తెలంగాణలో విప్లవం సృష్టించిన ఎంతోమంది మేధావుల గురించి సమాజానికి చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్, రచయిత జాకీర్, పుస్తక రచయిత మంగళారపు లక్ష్మణ్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు సి.విఠల్, రచయిత డా.తైదల అంజయ్య, సీనియర్ పాత్రికేయులు తులాయిల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఓయూ పురోగాభివృద్ధికి సహకరిస్తా

● త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

తార్నాక, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం పురోగాభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేన రెడ్డి అన్నారు. ఓయూ పూర్వ విద్యార్థుల సంఘం, ఉస్మానియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఓయూలోని డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో నల్లు ఇంద్రసేనారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్రిపుర రాష్ట్ర గవర్నర్‌గా నియామకం కావడం గర్వంగా ఉందని, పూర్వ విద్యార్థిగా ఉస్మానియా యూనివర్సిటీ గర్వించే విధంగా తన బాధ్యతలను నిర్వర్తిస్తానన్నారు. అనంతరం ఓయూ పూర్వ విద్యార్థుల సంఘం, ఉస్మానియా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ నల్లు ఇంద్రసేనారెడ్డి త్రిపుర గవర్నర్‌గా నియమితులవ్వడం వర్సిటీకి గర్వ కారణమని అభిప్రాయపడ్డారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల పట్ల స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకున్నారని, ఆయన అంకితభావం, నాయకత్వ లక్షణాలు భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని కొనియాడారు. కార్యక్రమంలో ఓయూ వీసీ డా.రవీందర్, ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.పి.లక్ష్మీనారాయణ, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎ.శ్యామ్‌మోహన్, ఓయూ ఫౌండేషన్ డైరెక్టర్ డా. డి.విజయ్‌కుమార్, ప్రొ.రాజశేఖర్, ప్రొ.రమేష్‌రెడ్డి, ప్రొ. మనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, తదితరులు

సికింద్రాబాద్ పార్లమెంట్ క్రికెట్ లీగ్ ప్రారంభం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): యువత ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు ఉపయోగపడతాయని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు, యువజన కాంగ్రెస్ నేత అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరగనున్న సికింద్రాబాద్ పార్లమెంట్ క్రికెట్ లీగ్ పోటీలను మంత్రి ఆదివారం పీవీ మార్గంలోని పిట్ స్టాప్ ప్రాంగణంలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడుస్తూ సమాజంలో మార్పు కోసం కృషి చేయాలని సూచించారు. నిర్వాహకుడు అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ సోమవారం నుంచి నియోజకవర్గాల వారీగా పోటీలు ప్రారంభమవుతాయని, మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లతో పార్లమెంట్ స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. మొదటి బహుమతి లక్ష రూపాయలు, రెండో బహుమతిగా 50 వేలు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు 25 వేల రూపాయల నగదు బహుమతి, ట్రోఫీలను అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్‌ఖాన్, కోట నీలిమ, పార్టీ కార్పొరేటర్లు, యువజన కాంగ్రెస్ నేత మంత్రి సచ్‌దేవ్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ

బర్కత్‌పుర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 22 శాతానికి కుదించిందని, దీంతీ బీసీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గువ్వల భరత్‌తో కలిసి ఆదివారం సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశామని ఆర్. కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ సంస్థలలోని సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ, చైర్మన్‌లు, వార్డు మెంబర్స్, కౌన్సిలర్స్, కార్పొరేటర్లలో బీసీల జనాభా దామాషా ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో స్థానిక సంస్థల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని పేర్కొన్నారని, దానిని 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. కుల గణన చేపట్టడానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. బీసీల విద్య ఉద్యోగ రంగాల రిజర్వేషన్లను 55 శాతానికి పెంచాలని, క్రిమిలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని, ప్రస్తుతం 13 కార్పొరేషన్లతోపాటు మరో 40 బీసీ కులాల కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో బీసీ సంఘాల నేతలు గుజ్జ కృష్ణ, భరత్, నీల వెంకటేష్, గుజ్జ సత్యం, సి.రాజేందర్, రామకృష్ణ, మట్ట జయంతి, బలరాం, శివ, అరవింద్, రాకేష్, దత్త, జ్యోతి ఉన్నారు.

● స్వీట్లు పంపిణీ



బీజేపీ సీనియర్ నాయకులు ఎల్‌కే అద్వానీకి భారతరత్న అవార్డు వచ్చిన సందర్భంగా బీకేగూడలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల మహేష్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లింగంపల్లి నర్సింగరావు, హృషికేశవ, సుమన్, శివ, రమేష్, లక్ష్మణ్, నాగార్జున, ప్రియ తదితరులు పాల్గొన్నారు.
- సనత్‌నగర్, ఆంధ్రజ్యోతి

రేకుల ఇంటిపై పడిన సెల్‌టవర్ రిసీవర్

● ధ్వంసమైన పైకప్పు
● ఇంట్లో ఎవరూ లేకపోడంతో తప్పిన ప్రమాదం



టవర్ రిసీవర్ పడి ధ్వంసమైన పై కప్పు

బోరబండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బోరబండ స్వరాజ్‌నగర్‌లో రేకుల ఇంటిపై జియో సెల్ టవర్ రిసీవర్ పడి పైకప్పు ధ్వంసమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రెండు సంవత్సరాల క్రితం ఓ ఇంటిపై జియో సెల్ టవర్ నిర్మించారు. ఆ టవర్‌కు సాంకేతిక లోపం రావడంతో టెక్నికల్ సిబ్బంది ఆదివారం మరమ్మతులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో సెల్ టవర్ విడి భాగమైన రిసీవర్ ఊడిపోయి మిద్దె పై ఉన్న రేకులపై పడటంతో రేకులు ధ్వంసమై బెడ్‌రూంలోని మంచంపై పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సెల్ టవర్ నిర్మించేటప్పుడు ఇళ్ల మధ్యలో సెల్ టవర్స్ వద్దని స్థానికులు అభ్యంతరం చెప్పినప్పటికీ జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోకుండా సెల్ టవర్‌కు అనుమతి ఇచ్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



వేంకటేశ్వరస్వామి కల్యాణంలో ఎమ్మెల్యే తలసాని తదితరులు

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

అమీర్‌పేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట డివిజన్ ధరమ్‌కరం రోడ్డులోని జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వల్లభ వెంకటేశ్వర స్వామి కల్యాణంలో మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు తలసానిని సన్మానించారు. కార్యక్రమంలో సుబ్బారావు, శ్రీనివాస్‌గుప్తా, ప్రవీణ్, బాలాజీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న ఎల్లమ్మ ఆలయం

బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

అమీర్‌పేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. గత నెల 27 నుంచి 31 వరకు ఐదు రోజుల పాటు శతచండీయుత మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు గర్భగుడిలో దర్శనం, అద్దె గదుల కేటాయింపులు రద్దు చేశారు. దీంతో మొక్కులు చెల్లించాల్సిన భక్తులు తమ పర్యటనలను వాయిదా వేసుకుని ఆదివారం విచ్చేశారు. దీంతో దర్శనం లైన్ భారీగా పెరిగింది. అమ్మవారి దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది.

● సిద్ధి గణపతికి పూజలు



ముంబైలోని సిద్ధివినాయస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు
- బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

● వినతి



అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రతినిధులు పవనం శివశంకర్, జైభీమ్ యాదగిరి, శేఖర్, మోహన్, వీరేష్ చెన్నూర్ శాసనసభ్యులు జి.వివేక్‌వెంకటస్వామిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో నిర్మిస్తున్న అంబేడ్కర్ విగ్రహాల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించేలా చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేకి విన్నవించారు.
- బోరబండ, ఆంధ్రజ్యోతి

భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు మోదీ కృషి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు ప్రధాని మోదీ దూరదృష్టితో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. యువతను ముందుంచి 2047 కల్లా భారత్‌పై ఇతర దేశాలు ఆధారపడేలా చేయాలనేదే ప్రధాని లక్ష్యమన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12 ఎమ్మెల్యే కాలనీలో మీట్ అండ్ గ్రీన్ పేరిట ఆయన ఆదివారం కాలనీవాసులను కలుసుకున్నారు. అభివృద్ధి విషయంలో కేంద్రం చేపడుతున్న పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజకీయాలు అన్ని కూడా ఓటు బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాయన్నారు. దేశంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు అప్పు చేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, ఇది మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. శక్తికి మించిన పథకాలు ఇలాగే కొనసాగితే దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్రాలు దివాళా బారిన పడతాయన్నారు. మౌలిక సదుపాయాలకు కూడా నిధులు కరువవుతాయన్నారు. తెలంగాణలో అనేక కార్పొరేషన్‌లు పెట్టి అప్పులు తీసుకువచ్చి మరీ ఖర్చులు పెట్టారని ఆరోపించారు. కానీ మోదీ మాత్రం డబ్బు వృథా కావొద్దనే అనే ఉద్దేశంతో అన్ని రాష్ట్రాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. నగరంలో సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వేస్టేషన్‌లను అభివృద్ధి చేయడంతో ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలో ఉన్న చర్లపల్లిని స్టేషన్‌కు పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. రవీంద్రభారతి తరహాలో హైటెక్‌సిటీలో 26 కోట్ల నిధులతో ఆడిటోరియం నిర్మిస్తున్నట్టు తెలిపారు. సాంస్కృతి, పర్యాటక అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్టు వివరించారు. నేషనల్ సైన్స్ సెంటర్ కోసం 25 ఎకరాల్లో నిర్మించేందుకు భూమిపూజ చేయనున్నట్టు తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో గతంలో వేలాది మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయేవారని, ప్రస్తుతం శాంతియుత పరిస్థితి నెలకొనడంతో విదేశీ పర్యాటకుల సంఖ్య పెరిగిందన్నారు. వచ్చే ఐదు సంవత్సరాలు మరింత కీలకమని కాబట్టి అందరూ విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, కాలనీవాసులు అరుణ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం బోయినపల్లి శ్రీరాముడు

- 1958కి చెందిన పురాతన మందిరం
- అలనాడు హరికథలు, బుర్రకథలకు ఈ ఆలయం ప్రసిద్ధి
- అభివృద్ధికి నోచుకోని వైనం
- దాతల సహకారం కోసం వేచిచూస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బోయినపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని బోయినపల్లి కంసారిబజార్‌లో భద్రాచలం, ఒంటిమిట్ట ఆలయాల లాంటి రామాలయం ఉంది. ఈ ఆలయంలోని రాముడు భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. భద్రాచల రామాలయం ఆంధ్రప్రదేశ్‌లోని ఒంటిమిట్ట ఆలయాల్లా ఉన్న శ్రీరామచంద్రమూర్తి తరహాలో బోయినపల్లి కంసారిబజార్‌లో ఉన్న శ్రీరామమందిరంలోని మూలవిరాట్ అయిన శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయుడు భక్తులకు దర్శనమిస్తుంటారు. 1958లో ఈ ప్రదేశంలో వెలసింది. తద్వారా విగ్రహాల పునః ప్రతిష్ఠలో భాగంగా శాంతిలాల్ అనే భక్తుడి సహాయంతో జోద్‌పూర్ నుంచి తెప్పించిన సీత, లక్ష్మణులతో పాటు ఆంజనేయస్వామి విగ్రహాలు కలిపి ఈ శ్రీరాముడి విగ్రహానికి అలనాడు గుడి కట్టడానికి డబ్బులు లేకపోవడంతో ఈ ప్రదేశంలో ఉండే కొందరు ఆర్మీ జవాన్‌ల సహాయంతో స్థానికులు ఓ ఇంటిని నిర్మించి అందులో విగ్రహాలు ప్రతిష్ఠించారు. దీంతో ఆనాటి నుంచి దాదాపు 68 సంవత్సరాలుగా రాములవారు నిత్యం పూజలు అందుకుంటున్నారు. ఈ రామాలయంలో రోజు ఆగమ పద్ధతిలో రాములోరు పూజలు అందుకుంటున్నారు. పురాతన దేవాలయం ఎలాగైతే మూర్తిలో తేజస్సు ఉంటుందో ఆ ఆలయంలోని విగ్రహాలలో అదే తేజస్ కనిపిస్తుంటుంది. దీనికి తోడు ఆ ఆలయం లోపలికి ప్రవేశిస్తుండగా ఆలయ ప్రధాన ద్వారంపైన విష్ణుమూర్తి అవతారంలో ఆలయ ద్వారం నుంచి తేజస్ రావడం ప్రత్యేకత. ఈ ఆలయంలోకి వెళ్లగానే భక్తులకు ఏదో తెలియని కాంతివచ్చి పూర్తి భక్తిలోకి వెళ్తుంటారు. దీనికితోడు ఆలయంలో భక్తితో ఏదైనా కోరిక కోరితే తప్పక నెరవేరుతుందనేది భక్తుల నమ్మకం నేటికీ కొనసాగుతుండడం ఆలయ విశేషం.



విష్ణుమూర్తి అవతారంలో ఆలయ ద్వారం వద్ద ఆలయ ధర్మకర్తలు



ఆలయంలో మూలవిరాట్ విగ్రహాలు

66 ఏళ్ల క్రితం నిర్మాణం..

ఇక్కడి రామచంద్రమూర్తి సుమారు 66 ఏళ్ల క్రితం బోయినపల్లి వాస్తవ్యులు కొందరు రాత్రి సమయాలలో భజనలు చేస్తూ ఈ ప్రాంతంలో బయట నిద్రిస్తున్న సమయంలో స్వప్నంలో సాక్షాత్కరించి తనకు ఆలయం నిర్మించమని చెప్పారట. సాయి సీతారామయ్య, పాండు రంగచారితో పాటు మరికొందరు అప్పటి నుంచి తమ సర్వస్వాన్ని ధారబోసి బంగు సున్నంతో పూర్తి ఆగమ శాస్త్ర బద్ధంగా ఆలయాన్ని ఓ ఇంటి మాదిరిగా కొంత మంది ఆర్మీ జవాన్‌ల సహాయంతో నిర్మించినట్లు ఆర్మీ రికార్డులు చెబుతున్నాయి. తద్వారా ఆగమ శాస్త్ర పండితులను పిలిపించి వారితో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించి తరించారట. వారి వంశీకులు స్థానికులు ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషిచేశారు. పురోహితుడు అప్పట్లో సాయి సీతారామయ్య ఆలయంలో జరిగే కల్యాణ మహోత్సవానికి పౌరోహిత్యం చేశారు. ఐదు సంవత్సరాల క్రితం వరకు ఆయన మనుమల ఆధ్వర్యంలో ప్రాచీన రామాలయంలో వివాహ తంతు, వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుతం వారి బంధువులు సన్నిదానం రమేష్, సంతోష్‌శర్మ ఆలయ పూజారులుగా పూజలు కొనసాగిస్తుండగా ఆలయ అభివృద్ధిలో భాగంగా ఆలయ ప్రెసిడెంట్ రామ్‌గౌడ్, చైర్మన్ ఎం.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా నాగరాజు, కోశాధికారిగా దేవత మధు, ఆలయ సభ్యులుగా బలరాం, బండి శ్రీనివాస్, సంతోష్ ఆధ్వర్యంలో నిత్య కైంకర్యాలు, నిత్య పూజలు జరుగుతున్నాయి. ఆలయంలో పూజా కార్యక్రమాలు ఆగమ పద్ధతిలో నిర్వహించడం ఆచారంగా వస్తుంది. నగరంలోని పురాతన ఆలయాలలో ఒకటి అయిన బోయినపల్లి రామమందిర్ చరిత్రలో నిలిచిపోయింది.

కానీ ఆలయ అభివృద్ధికి నోచుకోకపోవడం స్థానికులకు కొంత బాధ కలిగిస్తుంది. ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి ఖర్చుతో కూడుకున్నది కావడంతో భక్తులు, దాతల సహకారం కోసం ఆలయ ధర్మకర్తలు ఎదురుచూస్తున్నారు.

అనుకున్నది నెరవేరుతుంది..

ఈ రామాలయంలో ప్రతి శనివారం ఉదయం 6 గంటలకు రాముడికి పుష్పార్చన జరుగుతుంది. భక్తులు అందరూ ఉపస్థితి కావాలి. శనివారం సాయంత్రం భజనలు ఉంటాయి. ప్రాచీన రామాలయంలోని రామచంద్రమూర్తిని దర్శించుకుని పునీతులు కావాలి. కోరిన భక్తుల కొంగుబంగారంగా స్వామివారు నిలుస్తున్నారు.

- సన్నిదానం సంతోష్‌శర్మ, ఆలయ పూజారి

ఆలయాభివృద్ధికి దాతలు ముందుకు రావాలి..



ఈ ఆలయం ఎంతో మహిమగలిగిన ఆలయం. ఈ ఆలయాభివృద్ధికి మేము ఎంతో కృషి చేస్తున్నాం. ఆలయం మరింత అభివృద్ధి చెందాలంటే దాతల సహకారాలు అవసరం. రాబోయే తరాలకు కూడా ఈ ఆలయం అందుబాటులో ఉండడానికి ఆలయ అభివృద్ధి అవసరం.

- ఎం.శ్రీనివాస్, ఆలయ చైర్మన్

సనాతన ధర్మాన్ని కాపాడాలి



నగరంలో పురాతన రామమందిరాలలో ఒకటి బోయినపల్లి రామ మందిరం. భక్తులు ఈ ఆలయాన్ని తప్పకుండా దర్శించుకుని మన సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదీ. దర్గాలకు వెళ్లి మన సనాతన ధర్మాన్ని నాశనం చేయకుండా ఈ ఆలయాన్ని ఒక్కసారి దర్శించుకోవాలి.

- రాముగౌడ్, ప్రెసిడెంట్

బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరం..



ఈ ఆలయం బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉంటుంది. నగరం నలుమూలల నుంచి వచ్చిన వారు బోయినపల్లి బస్టాప్‌లో దిగి 100మీటర్లు ముందుకు వస్తే కంసారిబజార్ వస్తుంది. అందులోనే ఈ రామమందిరం ఉంటుంది.

- నాగరాజు, జాయింట్ సెక్రటరీ



ఎల్లంకి వీరేశాన్ని సన్మానిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

తెలంగాణ కల్చరల్ కో-చైర్మన్‌గా వీరేశం గుప్తా

అడ్డగుట్ట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వైశ్య సంఘాలకు విశిష్ట సేవలందిస్తున్న సికింద్రాబాద్ తుకారాంగేట్‌కు చెందిన ఎల్లంకి వీరేశంగుప్తా తెలంగాణ కల్చరల్ కో-చైర్మన్‌గా నియమితులయ్యారు. ఇంటర్‌నేషనల్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా నియామక పత్రాన్ని వీరేశంగుప్తాకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వీరేశంగుప్తా మాట్లాడుతూ తెలంగాణ కల్చరల్ కో-చైర్మన్‌గా నియమించడం ఆనందంగా ఉందని అన్నారు. తనకు పదవిని అప్పగించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ ఉపాధి, శిక్షణ శాఖ సౌజన్యంతో సంకల్ప్ పథకంలో భాగంగా బేగంపేట్‌లో నిరుద్యోగ యువతకు శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రొడెక్టివిటీ కౌన్సిల్(ఏపీపీసీ) ప్రాజెక్ట్ సమన్వయకర్త ఏ.వీ. జయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ శిబిరంలో దివ్యాంగులైన యువతకు ఉచిత భోజన, వసతి సౌకర్యంతో డేటా ఎంట్రీ, ఇంగ్లీష్ కమ్యూనికేషన్‌లలో ఉచిత శిక్షణ ఉంటుందని, శిక్షణానంతరం శిక్షణ పొందినవారికి ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన యువత 9618002807, 8179175768 నెంబర్లలో సంప్రదించగలరని ఆమె తెలిపారు.

సికింద్రాబాద్ ఎంపీ టికెట్ కేటాయించాలి



దరఖాస్తు అందజేస్తున్న మహ్మద్ సబీర్ పాషా

బౌద్ధనగర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయటానికి కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఎంపీ టికెట్‌ను కేటాయించాలని వారాసిగూడకు చెందిన ప్రభుత్వ ఇస్లామియా హైస్కూల్ ఫర్ బాయ్స్ ప్రధానోపాధ్యాయుడు, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ (రూప్) ఉపాధ్యక్షుడు మహ్మద్ సబీర్ పాషా కోరారు. ఈమేరకు గాంధీభవన్‌లో సికింద్రాబాద్ ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పలు సేవా కార్యక్రమాలు చేశానని, తనకు టికెట్ కేటాయిస్తే గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

స్కైఫౌండేషన్‌కు ఆర్థిక చేయూత



రసీదు అందజేస్తున్న పావని

పద్మారావునగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై దుర్భరమైన జీవనం గడుపుతున్న అభాగ్యులకు ఆహారాన్ని అందజేస్తున్న పద్మారావునగర్‌లోని స్కైఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థకు పద్మారావునగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంబీఆర్ సంస్థల అధిపతి మామిడి బాల్‌రెడ్డి రూ.20వేల విలువచేసే నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు చేస్తున్న సమాజ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్కైఫౌండేషన్ అధ్యక్షుడు వై.సంజీవకుమార్, ఉపాధ్యక్షురాలు పావని పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న బీజేపీ నాయకుడు మల్కా కొమురయ్య

క్రీడలు దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తాయి

మారేడుపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్రీడలు దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తాయని బీజేపీ నాయకుడు మల్కా కొమురయ్య అన్నారు. ప్లే ఫర్ మల్కాజిగిరి క్రికెట్ టోర్నీలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన షాబాజ్ జట్టు, భూషణ్ జట్లకు ట్రోఫీలతో పాటు నగదు బహుమతిగా చెక్కులను మల్కా కొమురయ్య మహేంద్ర హిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన షాబాద్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.50 వేల చెక్కును, ద్వితీయ స్థానంలో నిలిచిన భూషణ్ జట్టుకు రూ.20వేల చెక్కును అందజేశారు. అనంతరం మల్కా కొమురయ్య మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంటుకు 40 జట్లు, 440 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారని అన్నారు. ఖేల్ ఇండియా స్ఫూర్తితో ఈ టోర్నమెంటు నిర్వహించామన్నారు.



అద్వాణీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కంటోన్మెంట్ బీజేపీ శ్రేణులు

అద్వాణీకి భారతరత్న ప్రకటించడం పట్ల హర్షం

మారేడుపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): లాల్ కృష్ణ అద్వాణీకి కేంద్ర ప్రభుత్వం భారత రత్న పురస్కారం ప్రకటించడం పట్ల కంటోన్మెంట్ బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పికెట్ చౌరస్తాలో మారేడ్‌పల్లికి చెందిన శ్రీరామ క్యాటరింగ్ నిర్వాహకుడు ఎస్. నాగభూషణంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కంటోన్మెంట్ పార్టీ శ్రేణులతో పాటు మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ విచ్చేసి అద్వాణీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకు ముందు స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు టోపి శంకర్, మాచర్ల శ్రీనివాస్, విజయానంద్, రాజ్ మల్లేష్, అరుణ్, కనకరాజ్, ఉగ్రసేన్, మంజునాథ్, శివకుమార్, నరేందర్, గిరి పాల్గొన్నారు.

సత్యనారాయణకు బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు



శాలువాతో సత్కరిస్తున్న జంపన ప్రతాప్

బోయినపల్లి : బోయినపల్లిలోని వేంకటేశ్వర వేదాంత వర్థిని సంస్కృత కళాశాలలో పనిచేయుచున్న బి.సత్యనారాయణకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పవన్ శ్రీకాంత్, ప్రేమ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో ఐలాండ్ కంటి ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

తిరుమలగిరి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక వైద్య సేవలతో రోగులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ఓల్డ్ అల్వాల్‌లో ఐలాండ్ కంటి ఆస్పత్రిని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శరత్ చంద్రతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఓల్డ్ అల్వాల్‌లోని ప్రధాన రహదారిలో శ్రీ బేకరి సమీపంలో కంటి వైద్యంతో పాటు సాధారణ వైద్య సదుపాయాలు అందించేందుకు ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా రోహిత్‌రావు మాట్లాడుతూ ఈ వైద్యశాల అత్యాధునిక వసతులతో రూపొందిందన్నారు. ఈ ప్రాంతంలో ఇలాంటి కంటి వైద్యశాల ఏర్పడడం గర్వించదగిందని ఆయన అన్నారు. మరిన్ని ఆస్పత్రులను ఏర్పాటు చేసి వైద్యరంగంలో విజయాలు సాధించి ఎదగాలని రోగులకు సేవలు చేయాలని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రోగులకు వైద్య సేవలను అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. వివిధ విభాగాలను అత్యాధునికంగా ఉన్న మిషనరీలను, ల్యాబ్‌ను, ఆపరేషన్ థియేటర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు.

అత్యంత విశాలమైన భవనంలో పార్కింగ్ సదుపాయంతో రోగులకు సరిపడా సిబ్బందితో ఆస్పత్రి సంపూర్ణంగా 24 గంటలు వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా రూపొందిందన్నారు. కార్యక్రమంలో వైద్యులు కొండా వేణుమూర్తి, ప్రముఖ వ్యాపారవేత్త నీలంబర్, మాజీ కార్పొరేటర్ జితేందర్, కాంగ్రెస్ నాయకులు డీ.బీ.దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోయినపల్లి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లలో మరమ్మతులతో పాటు చెట్ల కొమ్మల తొలగింపు చేస్తున్న కారణంగా బోయినపల్లి విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బోయినల్లి సీబీడీ ఏడీఈ భిక్షపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11కేవీ శక్తిపురం ఫీడర్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, జ్యోతి పాలిమర్స్, రాక్‌టూల్స్ నాలా, రాజీవ్‌గాంధీనగర్, ఐడి ఫ్రెష్ ఫుడ్స్, ఎస్ఆర్ ఎంటర్‌ప్రైజెస్, దక్కన్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ప్రశాంత్‌నగర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, సీఎన్‌సీ సబ్‌స్టేషన్, గణేష్ కాంటా, ఎన్‌కె కోర్టు కాంప్లెక్స్, శ్రీవెంకటేశ్వర గ్రీన్ హిల్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు సహకరించాలని బోయినపల్లి విద్యుత్‌శాఖ సీబీడీ ఏడీఈ అధికారి విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.

మహిళా న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అతిథులు

మారేడుపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్‌ను జూలూరి రమాదేవి మెమోరియల్ పేరున వెస్ట్ మారేడ్‌పల్లి క్రీడామైదానంలో ఆదివారం నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్‌గౌడ్, కౌన్సిల్ మెంబర్ భుజంగరావు ప్రారంభించారు. జె.సుశీల్‌కుమార్ నిర్వహణలో సీబీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ ఐపీసీ నాలుగు జట్లుగా తలపడ్డారు. ఇందులో సీఆర్‌పీసీ, ఐపీసీ జట్లు ఫైనల్లో తలపడ్డాయి. ఐపీసీ జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మూడవ సీనియర్ జడ్జి కె.స్వప్న 20వ ఏసీఎంఎం సీహెచ్ ఆశాలత, 20వ ఏసీఎంఎం కల్పన విచ్చేసి విజేతగా నిలిచిన ఐపీసీ జట్టుకు, సభ్యులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్పొరేటర్ కొంతం దీపికతో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్, దానేశ్వరరావు, జనరల్ సెక్రటరీ ఆశరాజు, కోచ్ విశాల్, ప్రతినిధులు మందాకిని, సంధ్య, విశాల్, మురళి, శ్రీకాంత్, ప్రదీప్ పాల్గొన్నారు.



బోల్తా పడిన రెడిమిక్స్ లారీని పరిశీలిస్తున్న పోలీసులు

డివైడర్‌ను ఢీకొట్టి లారీ బోల్తా

చిలకలగూడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిర్లక్ష్యంతో లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడిన సంఘటన మెట్టుగూడలో ఆదివారం ఉదయం జరిగింది. మెట్టుగూడ, ఆఫీసర్స్ క్లబ్ వద్ద నాచారం ప్లాంట్ నుంచి హైటెక్ సిటీకి లోడుతో వెళ్తున్న రెడీ మిక్స్ లారీ డివైడర్‌ని ఢీకొట్టి బోల్తా పడింది. సంఘటనా స్థలానికి చేరుకున్న చిలకలగూడ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీధర్‌శేఖర్ ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని డ్రైవర్ లారీని వదిలి పారిపోయాడని తెలిపారు. చిలకలగూడ లా అండ్ ఆర్డర్ పోలీసులు లారీ యాజమాన్యంపై కేసు నమోదు చేస్తామని ప్రమాదానికి కారణాలు తెలియవలసి ఉందని అడ్మిన్ ఎస్ఐ బాలరాజు తెలిపారు. ఘటనా స్థలం వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పెట్రోలింగ్ సిబ్బంది సైదులు, ఆర్. దీపక్‌కుమార్ చర్యలు చేపట్టారు.

ఓయూ పురోగాభివృద్ధికి సహకరిస్తా

- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి



నల్లు ఇంద్రసేనా రెడ్డిని శాలువాలతో సత్కరిస్తున్న ఓయూ పూర్వ విద్యార్థుల సంఘం, ఉస్మానియా ఫౌండేషన్ ప్రతినిధులు

తార్నాక, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం పురోగాభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఓయూ పూర్వ విద్యార్థుల సంఘం, ఉస్మానియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఓయూలోని డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో నల్లు ఇంద్రసేనారెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిపుర రాష్ట్ర గవర్నర్‌గా నియామకం కావడం గర్వంగా ఉందని, ఓయూ పూర్వ విద్యార్థిగా ఉస్మానియా యూనివర్సిటీ గర్వించే విధంగా తన బాధ్యతలను నిర్వర్తిస్తానన్నారు. అనంతరం ఓయూ పూర్వ విద్యార్థుల సంఘం, ఉస్మానియా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఓయూ పూర్వ విద్యార్థి నల్లు ఇంద్రసేనా రెడ్డి త్రిపుర గవర్నర్‌గా నియమితులవ్వడం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి గర్వ కారణమని అభిప్రాయపడ్డారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల పట్ల స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకున్నారని, ఆయన అంకిత భావం, నాయకత్వ లక్షణాలు భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని కొనియాడారు. కార్యక్రమంలో ఓయూ వీసీ డా. రవీందర్, ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. పి. లక్ష్మీనారాయణ, ఓయూ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎ.శ్యామ్ మోహన్, ఓయూ ఫౌండేషన్ డైరెక్టర్ డా. డి. విజయ్ కుమార్, ప్రొ.రాజశేఖర్, ప్రొ.రమేష్ రెడ్డి, ప్రొ. మనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



మహ్మద్ అబ్దుల్ షాహిద్

బోయినపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లికి చెందిన మహ్మద్ అబ్దుల్ షాహిద్(50) ఓల్డ్ బోయిన్‌పల్లి గోరినగర్‌లో భార్య సుస్రత్ బేగంతో కలిసి నివాసం ఉంటున్నాడు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు ఆస్ట్రేలియాలో, కూతురు కెనడాలో ఉంటున్నారు. అయితే మహ్మద్ అబ్దుల్ షాహిద్ రెండురోజుల క్రితం ఓ పని మీద కేరళకు వెళ్లివచ్చి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం భార్య సుస్రత్ బేగంకు చెప్పకుండా ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భర్తకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తుంది. దీంతో తెలిసిన వారిని బంధువులను ఆరా తీసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో అనుమానం వచ్చిన భార్య ఆదివారం తన భర్త కనిపించడంలేదని బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నక్సల్ ఉద్యమం లేకుంటే తెలంగాణ ఉద్యమం లేదు

- టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నక్సల్ ఉద్యమం లేకుంటే తెలంగాణ ఉద్యమం లేదని టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. తెలంగాణ సమాజంలో ఉన్న అసమానతల కారణంగానే యువత తిరుగుబావుటా ఎగురవేసిందన్నారు. మంగళారపు లక్ష్మణ్ రాసిన 'మాయని గాయాల నెత్తుటి చరిత్ర' (యదార్థ సంఘటనల సమాహారం) పుస్తక పరిచయ కార్యక్రమాన్ని రవీంద్రభారతి మినీహాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను విముక్తి చేసింది నక్సల్స్ ఉద్యమమనే నిజాన్ని సమాజానికి చెప్పాలన్నారు. కరీంనగర్‌తో పాటు మరిన్ని ప్రాంతాల చరిత్ర రాయాల్సిన అవసరముందన్నారు. మార్కెట్‌కు వచ్చిన రైతులను భూస్వాములు వేధించేవారని, కుల వివక్ష తీవ్రంగా ఉండటంతో హుస్నాబాద్ వంటి ప్రాంతాల్లో నక్సల్ ఉద్యమాలు జరిగాయన్నారు. ఆకలితో ఉన్న వారితోపాటు ఆకలి బాధ తెలిసిన ఎంతోమంది నక్సల్ ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. చరిత్రలో జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు తెలిపేందుకు తెలంగాణ సమాజంలో జరిగిన ఉద్యమాలపై ప్రత్యేక పుస్తకాలు రావాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి కార్పొరేషన్ తొలి చైర్మన్ వి.ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యమస్ఫూర్తిని చంపేశారని, మళ్లీ ఉద్యమస్ఫూర్తి రావాలన్నారు. ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ తెలుగునాట జరిగిన నక్సల్ బరి ఉద్యమంలో ఉన్నత చదువులు చదువుకున్న ఎంతోమంది ప్రాణ త్యాగం చేశారన్నారు. మాయని గాయాల నెత్తుటి చరిత్ర వంటి పుస్తకాలు మరిన్ని రావాలన్నారు. తెలంగాణలో విప్లవం సృష్టించిన ఎంతోమంది మేధావుల గురించి సమాజానికి చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్, రచయిత జాకీర్, పుస్తక రచయిత మంగళారపు లక్ష్మణ్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు సి.విఠల్, రచయిత డా.తైదల అంజయ్య, సీనియర్ పాత్రికేయులు తులాయిల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గదిలో యువకుడి ఆత్మహత్య

అడ్డగుట్ట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లోని మదర్ థెరిస్సా విగ్రహం సమీపంలోని హిల్‌స్ట్రీట్ ప్రభుత్వ పాఠశాలలో 30 ఏళ్ల గుర్తుతెలియని యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన చావుకు యజమాని రాధాకృష్ణ మాలిక్ కారణమని హిందీలో రాసిన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. మృతుడ్ని గుర్తించిన వారు సమాచారం ఇవ్వాలని గోపాలపురం పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా రేపల్లేకు చెందిన మోహిత్(30) మృతదేహం ఘట్‌కేసర్ యార్డు సమీపంలో రైలు పట్టాల మధ్య పడి ఉంది. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మోహిత్ ఆత్మహత్య చేసుకున్నాడా, ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతిచెందాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు కేపీహెచ్‌బీలో అద్దెకు ఉంటూ సాఫ్ట్‌వేర్ కోర్సు నేర్చుకుంటున్నాడని భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.